క్లుప్తంగా

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత అన్నారు. శుక్రవారం కళాశాలలో మాదకద్రవ్యాలను వ్యతిరేకిస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు అలవాటుపడి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మాదకద్రవ్యాల నివారణ కోఆర్డినేటర్ రమేశ్, లెక్చరర్లు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి జూలై 7తో 31 సంవత్సరాలు గడుస్తున్నందున ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని గడియార్‌గార్, ఇంద్రనగర్, మావలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ సమాజం పట్ల బాధ్యతతో ప్రభుత్వాలతో విరోచితమైన పోరాటాలు చేసిందన్నారు. నాయకులు శరత్, గంగన్న, విఠల్, కృష్ణపల్లి రాజేశ్వర్, చిన్నయ్య, ప్రదీప్, రాజేశ్వర్, ప్రశాంత్, నాని పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను పార్ట్‌టైమ్ ప్రతిపాదికన భర్తీ చేయడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారిని లలిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక, రసాయన, మ్యాథ్స్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఎడ్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో జూలై 1న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. డెమో ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు.

రేపు అగ్నివీర్ మాక్‌టెస్ట్

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ, సోల్జర్స్ గ్రూప్ ఆధ్వర్యం లో అగ్నివీర్ ఆర్మీ ఉచిత మాక్ టెస్ట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు కు మాసం అనిల్ కుమార్ 9533650208, సోల్జర్స్ గ్రూప్ ఫౌండర్ కృష్ణ 9492622956 నంబర్‌లకు సంప్రదించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మాట్లాడారు. సీతాగోంది, కజ్జర్ల, బరంపూర్, రుయ్యాడి, తాంసి, తలమడుగు, నిపాని, అర్లి(టి), గిమ్మ, పెండల్‌వాడ, చప్రాల, సాంగిడి, ఆనంద్‌పూర్, దీపాయిగూడ, భోరజ్, రాంపూర్, దస్నాపూర్, ఖానాపూర్, పొన్నారి, కైలాస్‌నగర్ పరిధిలోని సబ్‌స్టేషన్‌లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిచి ఉంటుందని పేర్కొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



శిశువును అప్పగిస్తున్న ఈఎంటీ సురేశ్

బజార్‌హత్నూర్: మండలంలోని గోకొండ గ్రామానికి చెందిన గర్భిణి బరద్వల్ సోని శుక్రవారం పురిటినొప్పులతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువయ్యాయి. పైలెట్ రాజారాం వాహనాన్ని పక్కకు నిలిపివేయడంతో ఈఎంటీ సురేశ్ ఈఆర్‌సీపీ డాక్టర్ కసిరెడ్డిని ఫోన్‌లో సంప్రదించారు. అతని సూచనల మేరకు పురుడు పోశారు. అనంతరం రిమ్స్‌లో తల్లీ, బిడ్డను చేర్చారు. ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

'గాయత్రి'కి జలకళ



గాయత్రి జలపాతం

ఇచ్చోడ: మండలంలోని గాయత్రి జలపాతం జలకళతో పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు నీటి పరవళ్లు పాలనురుగును తలపిస్తున్నాయి. మండలంలోని గుండి వాగు వద్ద అటవీ ప్రాంతంలో సహజసిద్ధంగా ఏర్పడిన రెండు ఎత్తయిన కొండల మధ్య దాదాపుగా 350 అడుగులపై నుంచి ఎడిసిపడుతున్న జలసోయగం చూపరులను మంత్రముగ్ధులను చేస్తోంది.

కొర్టికల్ జలపాతం కనువిందు



నేరడిగొండ: మండలంలోని కొర్టికల్ గ్రామ సమీపంలోని జలపాతం జలధారతో కనువిందు చేస్తోంది. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ జలపాతం అందాలను ఆస్వాదిస్తూ వాహనదారులు, ప్రకృతి ప్రేమికులు మంత్రముగ్ధులవుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



నేరడిగొండ: మండలంలోని బోరిగాం బ్రిడ్జి సమీపంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయి. దీంతో ఆ దారిగుండా వెళ్లే ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రభాకర్‌రెడ్డి



ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఉట్నూర్‌రూరల్: ప్రజలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలో రూ.13 కోట్ల 75 లక్షలతో జిల్లా ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీ విఠల్‌లతో కలిసి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రజలు ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది ఉద్యోగాలను భర్తీ చేసేందుకు సంబంధిత శాఖ మంత్రితో చర్చించి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఖానాపూర్ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై డోర్ టూ డోర్ సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషాను ఆదేశించారు. అనంతరం ఇటీవల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహజన్, ఏఎస్పీ కాజల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి 'జూపల్లి'ని కలిసిన సీపీఐ నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులై మొదటి సారిగా పర్యటనకు వచ్చిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును సీపీఐ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ప్రభాకర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్ ఉన్నారు.

మంత్రిని కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్ నేతలు..

ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రధానచౌక్‌లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని గతంలో తోపుడు బండ్ల వీధి వ్యాపారులను తొలగించారని, ప్రస్తుతం ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగడం లేదని వారికి కేటాయించిన స్థలంలోనే వారి వ్యాపారం కొనసాగించేలా చూడాలని చాంబర్స్ ఆఫ్ కామర్స్ నాయకులు కోరారు. జిల్లా పర్యటనకు మంత్రి జూపల్లి కృష్ణారావును హరితవనం పార్కులో కలిశారు. గతంలో ట్రాఫిక్ అంతరాయంతో కనీసం అత్యవసర వాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి ఉండేదన్నారు. అధ్యక్షుడు దినేష్ మాటోలియా, ప్రధాన కార్యదర్శి కందుల రవీంద్ర ఉన్నారు.

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో గత రెండు దశాబ్దాలుగా నెలకొన్న ట్రాఫిక్ సమస్యను మరోసారి సృష్టించేలా ప్రయత్నిస్తున్న వారి ప్రయత్నాలను అడ్డుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దినేష్ మటోలియా, కందుల రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈవిషయంపై ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో శుక్రవారం చర్చించారు.

తులం బంగారం హామీ ఏమైంది?



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్

భీంపూర్: పెళ్లయిన ఆడపిల్లలకు పెళ్లికానుకగా తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఏమైందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం సవారీ బంగ్లా వద్ద షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. తహసీల్దార్ నలందప్రియ, మాజీ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్, మండల నాయకులు లస్మన్న, అనిల్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అనుచరులతో ఎమ్మెల్యే సందడి

ఇచ్చోడ: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన అనుచరులతో కలిసి అడవి అందాలను వీక్షిస్తూ సందడి చేశారు. బోథ్ నియోజకవర్గంలోని భీంపూర్ మండలంలో పర్యటను ముగించుకొని, సరిహద్దులో ఉన్న కిన్వట్ పట్టణానికి వెళ్తూ తన అనుచరులతో కలిసి ఫొటోలు దిగారు. ఇచ్చోడ, తలమడుగు, తాంసి, నేరడిగొండ, బోథ్ మండలాల నాయకులు ఉన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి'



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

తలమడుగు: గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మండల కేంద్రాల్లో ప్రజావాణి ప్రజావేదిక నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి గజానన్, ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నాలుగో విడత ప్రజావాణి ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు మండల అధికారులకు అర్జీలు సమర్పించారు. మండలంలో ఇప్పటివరకు 112 అర్జీలు వచ్చాయన్నారు. తహసీల్దార్ రాజ్‌మోహన్, వ్యవసాయ శాఖ అధికారి ప్రమోద్ రెడ్డి, విద్యుత్ ఏఈ శ్రీనివాస్, ఏపీవో మేఘమాల, సీనియర్ అసిస్టెంట్ నగేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



పొలంబాట నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

నేరడిగొండ: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ డీఈ ఈదన్న అన్నారు. శుక్రవారం మండలంలోని వాంకిడి గ్రామంలో పంట పొలాల్లో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో రైతులు విద్యుత్ మోటార్ల వద్ద విద్యుత్ తీగలను తాకొద్దని సూచించారు. విద్యుత్ వైర్లు కిందికి వేలాడితే శాఖ అధికారులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఇదిలా ఉండగా విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అత్యవసర సమయంలో 1912కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఏడీఈ లక్ష్మణ్, నేరడిగొండ ఏఈ నాగేంద్ర ప్రసాద్, లైన్‌ఇన్‌స్పెక్టర్ రాంమోహన్ రావు, లైన్ మెన్ మురళి, ఏఎల్‌ఎంలు అరుణ్, జాలం సింగ్ తదితరులు ఉన్నారు.

పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి



నిల్వ నీటిని తొలగిస్తున్న ఎంపీడీవో

తాంసి: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వర్షపునీరు నిల్వ లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో మోహన్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని హస్నాపూర్ గ్రామంలో డ్రైడేలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో పంచాయతీ సిబ్బందితో ఇంటింటా తిరుగుతూ ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఎంపీవో లింగయ్య, మాజీ సర్పంచ్ నర్సింగ్, పంచాయతీ కార్యదర్శి లావణ్య రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

బల్దియా అధికారులకు సమ్మె నోటీసు అందజేత

కైలాస్‌నగర్: వచ్చే నెల 9న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో బల్దియా కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. శుక్రవారం ఆర్‌వో కల్యాణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఇంజనీరింగ్ విభాగం ఏఈ మమతకు యూనియన్ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. వాటర్ సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ఆత్మారాం, మహేందర్, సంతోష్, మల్లేశ్, రాజేశ్వర్, లక్ష్మి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో వనదేవతకు పూజలు



పొల్లుగూడలో వనదేవతకు పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: ఆషాడమాసం పురస్కరించుకుని మండలంలోని గిరి గ్రామాల్లో అకాడి(వనదేవత) పూజలను ఆదివాసీలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వన దేవతలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం మండలంలోని పొల్లుగూడ, వాల్గొండ గ్రామాల్లో గ్రామ పొలిమేరలో గల వన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ వంటలు చేసి నైవేద్యం సమర్పించారు. అటవీ జంతువుల నుంచి పంటలు, పశుసంపదను రక్షించాలని మొక్కినట్లు ఆదివాసీ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు కొరెంగా లింగు, జుగ్నాక్ భరత్, ఆత్రం శంకర్, కినక లచ్చు, జుగాది రావ్, మర్సుకోల నాందేవ్, ఇంద్రు, సోమేశ్వర్ తదితరులు ఉన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి తెలిపారు.

మహిళలు ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి చెందాలి



చెక్కు అందజేస్తున్న మేనేజర్‌లు

బేల: స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి చెందాలని ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ గిర్మోజి నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సిర్సన్న గ్రామంలోని రైతువేదికలో స్వయం సహాయక సంఘాల రుణమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీమహిళ ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తే, కుటుంబానికి శ్రీరామ రక్షని తెలిపారు. బ్యాంకు, స్త్రీనిధి రుణాలు తీసుకుని సభ్యులు ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. మండల సమాఖ్యకు ఉన్న లక్ష్యం రూ.3.31కోట్లు తీసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత ఇన్సూరెన్స్ పాలసీ చేసుకోవాలని సూచించారు. బాది గ్రామంలో విద్యుత్ ప్రమాదంతో నష్టపోయిన కిరాణా వ్యాపారి బొల్లి దయాకర్‌కు రూ.2.35 లక్షల ఇన్సూరెన్స్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ఉత్పల్‌కుమార్ దామ్, బ్యాంకు మేనేజర్‌లు, ఏపీఎంలు, ఏఈవో, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డంతా బురదమయం!



తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామం నుంచి ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని పొచ్చెర గ్రామం వరకు నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రోడ్డు పనులు కొన్ని నెలల క్రితం నిలిచిపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదగా మారి చిత్తడిగా తయారైంది. వాహనదారులు రోడ్డుపై వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు'



మాట్లాడుతున్న అరుణ్ కుమార్

బోథ్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే గెలుపని ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం సొనాల మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచేందుకు సమష్టిగా పని చేయాలన్నారు. గాజుల పోతన్న, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేశ్ బత్తుల, అనిల్, పోశెట్టి, ఇస్రు పటేల్, కసిరె పోతన్న, రాము, ముండే శ్రీధర్, హరిసింగ్, సుధీర్, అజయ్, సత్యనారాయణ, అంకుష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు

చింతల్‌బోరి మాజీ సర్పంచ్ రాందాస్, జాదవ్ మారుతి, దోక్లే మారుతి, బుర్కే సంతోష్, జ్ఞానేశ్వర్ ముండే, పాండురంగ్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరగా అరుణ్‌కుమార్ కండువా కప్పి వారిని ఆహ్వానించారు.

స్టేట్ ర్యాంకర్ రుతికకు సన్మానం



రుతికను సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్తులు

బోథ్: ఇటీవల వెలువడిన లాసెట్ ప్రవేశపరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన ఎల్కొచి రుతికను వివిధ సంఘాల నాయకులు, గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ, బోథ్ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు, బోథ్ పట్టణ బ్రాహ్మణ సంఘం సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో సన్మానించారు.